క్లుప్తంగా

రేపు తపాలా సేవలపై అవగాహన సదస్సు

హన్మకొండ: ఈనెల 29న డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై హనుమకొండ నగర శివారు భట్టుపల్లిలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు హనుమకొండ సబ్ డివిజన్ ఉప తపాలా పర్యవేక్షణాధికారి మూల రమాదేవి తెలిపారు. తపాలా శాఖ ద్వారా అమలవుతున్న సేవలను ప్రజలకు వివరించనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామస్తులు సదస్సులో పాల్గొని తపాలా సేవలపై అవగాహన పెంచుకోవాలని ఆమె కోరారు.

4న 'టాక్స్' రాష్ట్ర సదస్సు



ఖిలా వరంగల్: ఆగస్టు 4న వరంగల్ చార్‌బౌలిలో పద్మశాలి భవనంలో జరగనున్న తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య (టాక్స్) సదస్సును విజయవంతం చేయాలని టాస్క్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల నాగరాజు పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ పడమరకోటలోని అమరవీరుల స్తూపం వద్ద రాష్ట్ర సదస్సు కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామ సురేందర్, గజ్జ చందు, రవన్న, బాబు, మహేందర్, భాస్కర్, దాసు, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుర్జీత్‌నగర్ గుడిసె వాసులకు పునరావాసం

కాజీపేట అర్బన్: వర్షాల కారణంగా న్యూశాయంపేటలోని సుర్జీత్‌నగర్‌లో నివాసముంటున్న సంచార జాతుల పేదలకు ప్రేరణ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్పోర్ట్ హనుమకొండ ఆధ్వర్యంలో పునరావాసం కల్పించారు. ఈ సందర్భంగా టార్పాలిన్లు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ స్పోర్ట్స్ సభ్యులు తులసీదాస్, శంకర్‌రావు, శ్రీలతారెడ్డి, మండల పరశురాములు, టీవీ అశోక్, తదితరులు పాల్గొన్నారు. కాగా, పునరావాసం కల్పించిన ఫౌండేషన్, లయన్స్ క్లబ్ సభ్యులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

కరీమాబాద్‌లో బల్దియా అధికారుల పర్యటన

- కల్వర్టులు, పైపులైన్ల లీకేజీల పరిశీలన



ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్‌లో ఇంజనీర్లతో కలిసి స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి, బల్దియా ఎస్సీ ప్రవీణ్‌చంద్ర, ఈఈ శ్రీనివాస్‌రావు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు పైపులైన్ల లీకేజీలు, తవ్వి వదిలేసిన గుంతలు, కల్వర్టుల నిర్మాణాలను పరిశీలించారు. వెంటనే లీకేజీలకు మరమ్మతులు చేయాలని, వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ రవికిరణ్, ఏఈ ముజామిల్, కాంట్రాక్టర్, ఇంజనీర్లు శ్రీనివాస్‌రాజు, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

రెడ్డి సంఘం కార్యదర్శిగా వాసుదేవరెడ్డి



హసన్‌పర్తి: రెడ్డి సంఘం మండల కార్యదర్శిగా దేవన్నపేట గ్రామానికి చెందిన సూరం వాసుదేవరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం మండల అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి శనివారం ప్రకటించారు. కాగా, తన నియామకానికి సహకరించిన రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి, నాయకులకు వాసుదేవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీఆర్ఈఎస్ కార్యవర్గం ఎన్నిక

కాశిబుగ్గ: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్(ఎస్సీఆర్ఈఎస్) వరంగల్ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘ్ నాయకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, కార్యదర్శిగా ఏ.బాలాజీ, కోశాధికారిగా ఎండీ.రఫీలతో పాటు మరో ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు.

మూడు షాపుల్లో చోరీ

రూ.35 వేల నగదు అపహరణ

రామన్నపేట: వరంగల్ హంటర్‌రోడ్డులోని మూడు ఐరన్ షాపుల్లో శనివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తెలిపారు. సీఐ కథనం ప్రకారం పల్లా ఈశ్వర్ షాపులో రూ.15 వేలు, కనకదుర్గ షాపులో రూ.5 వేలు, దుర్గ ఐరన్ మర్చంట్‌లో రూ.15 వేల నగదు చోరీకి గురైనట్లు వివరించారు. నలుగురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొనగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గోపి తెలిపారు.

చెరువును పూడ్చివేస్తున్నారు?

- పూడికతో కూరుకుపోతున్న జలాశయం
- చెరువులో జంతువుల కళేబరాలు
- కలుషితమవుతున్న నీరు

హసన్‌పర్తి: నగరంలోని 56వ డివిజన్ గోపాలపురం చెరువును పూడ్చేస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తాచెదారం, వ్యర్థాలతో చెరువు కూరుకుపోతోందని వాపోతున్నారు. దాన్ని కబ్జా చేసేందుకు రియల్టర్లు కుయుక్తులు పన్నుతున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈవిషయమై అధికారులకు చాలాసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదనే స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



వ్యర్థాలను చెరువులోకి నెడుతున్న జేసీబీ

కబ్జాకు గురవుతున్న చెరువు

నగరంలోని గోపాలపురం చెరువు సుమారు 22 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ఈ చెరువు ఇప్పటికే చాలా వరకు కబ్జాకు గురైంది. ఈ ప్రాంతంలో కొత్తగా నిర్మాణాలు చేసేందుకు పాత భవనాలను కూల్చివేయగా విడుదలవుతున్న మెటీరియల్‌ను ఆయా ఇళ్ల యజమానులు ట్రాక్టర్ల ద్వారా చెరువులో పోస్తున్నారు. దాంతో చెరువు కుచించుకుపోతోంది. వెస్ట్ మెటీరియల్‌ను జేసీబీలతో చెరువులోకి నెడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో దిగువ ఉన్న కాలనీలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

చెరువులో జంతువుల కళేబరాలు

గోపాలపురంతో పాటు చుట్టుపక్కల కాలనీల్లో జంతువులు మృతిచెందితే వాటి కళేబరాలను చెరువులో పడేస్తున్నారని పలువురు వాపోతున్నారు. దీంతో చెరువులోని నీరు కలుషితమవుతోందని పేర్కొంటున్నారు. చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోయిందని కాలనీవాసులు చెప్పారు. అధికారులు, పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వద్దు



తనిఖీలు చేస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టారు. ఒకటవ డివిజన్‌లోని పెగడపల్లి, ముచ్చర్ల, పలివేల్పుల, విజయలక్ష్మి కాలనీ, కాకతీయ యూనివర్సిటీ ఫిల్టర్ బెడ్ ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్సీ రాజయ్య, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, బయలాజిస్ట్ మాధవరెడ్డి, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఏఈలు దొడ్డి టి హరికుమార్, రాగి శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు స్రవంతి, బాషానాయక్, హెల్త్ అసిస్టెంట్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహన మరమ్మతులు చేయండి



వరంగల్ అర్బన్: యుద్ధప్రాతిపదికన వాహనాలకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. హనుమకొండలోని బాలసముద్రంలో వాహన షెడ్డును శనివారం తనిఖీ చేసి వాహనాల మరమ్మతులు, షెడ్డులో చేపట్టాల్సిన సివిల్ పనుల నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, రాజయ్య, డీఈ సంతోష్ బాబు, ఏఈ సంతోష్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలి

కాశిబుగ్గ: తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలను చైతన్యవంతులను చేసిన ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీఎం జంక్షన్ వరకు భిక్షమెత్తుతూ శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే తమ బతుకులు బాగుపడుతాయని అనుకుంటే గత ప్రభుత్వం తమను వాడుకుని జీవితాలను ఆగం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడు నెలల్లో ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఎనిమిది నెలలు గడుస్తున్నా కళాకారులకు ఇచ్చిన మాటను సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోలేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకొని ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కళాకారుల సంఘం నాయకులు గడ్డం సుధాకర్, ఎస్‌కె.రాజు, బిర్రు సురేందర్, సునీల్, రమేష్, రవి, అశోక్, సదానందం, రవిరాజ్, రజినికాంత్, రమ, రజిత పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న కళాకారులు

బాధిత మహిళలకు అండగా 'సఖి'

హసన్‌పర్తి: బాధిత మహిళలు, బాలికలకు సఖి కేంద్రం అండగా ఉంటోందని కేస్ వర్కర్లు హరిత, వినీల తెలిపారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ సహకారంతో భీమారంలోని శివాని జూనియర్ కళాశాలలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులకు న్యాయ, పోలీస్, వైద్య సహాయంతో పాటు తాత్కాలిక వసతి కల్పించనున్నట్లు వివరించారు.

చందాల పేరుతో వేధిస్తున్న వారిపై ఫిర్యాదు



కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేస్తున్న యజమానులు

హన్మకొండ అర్బన్: ఇటీవల కాలంలో కొంతమంది విద్యార్థి సంఘాలు, కుల సంఘాల పేరుతో తరచూ చందాల పేరుతో వేధిస్తున్న వ్యక్తులపై చర్యలు చేపట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమానులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో శ్రమకోర్చి విద్యాభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తున్న తమను సభలు, సమావేశాల పేరుతో డబ్బులు అడుగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చందాదారుల వేధింపులను అరికట్టాలి

కాజీపేట సెంటర్: చందాల పేరుతో వేధింపులకు గురిచేస్తున్న విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల నాయకుల వేధింపులను అరికట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమానుల కోరారు. ఈమేరకు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవికి కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీజేఎంఏ) ప్రతినిధులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులుగా, కుల సంఘాల నాయకులుగా పేరు చెప్పుకొని ఆర్‌టీఏ యాక్ట్ కింద కళాశాలలకు నోటీసులు ఇస్తూ బలవంతంగా చందాలు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో టీపీజేఎంఏ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, అడ్వైజరీ కమిటీ సభ్యులు డాక్టర్ తిరుపతి రెడ్డి, కోశాధికారి జే.రాజు తదితరులు పాల్గొన్నారు.

భారత శాస్త్ర విజ్ఞాన గని ఏపీజే అబ్దుల్‌కలాం

హన్మకొండ: భారత శాస్త్ర సాంకేతిక విజ్ఞాన గని భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ కొనియాడారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ మేరకు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా కలాం కీర్తి అజరామరమని పేర్కొన్నారు. అణు, ఆయుధ రూపకల్పనలో, క్షిపణుల తయారీకి ఆయన కృషి ఎనలేనిదన్నారు. అబ్దుల్‌కలాం జీవితం స్ఫూర్తిదాయకం అని తెలిపారు. బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, నాయకులు కుసుమ లక్ష్మీనారాయణ, జోరిక రమేష్, నయీమొద్దీన్, జానకిరాములు, వెంకన్న, రామ్మూర్తి, పరశురాములు, రాజు, రాజ్‌కుమార్, ఖలీల్, ఇస్మాయిల్, అనిల్, ప్రశాంత్, రాకేష్ యాదవ్, చాగంటి రమేష్, మహేష్, రఘు, వరుణ్, హరికృష్ణ పాల్గొన్నారు.



అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వినయ్‌భాస్కర్, నాయకులు

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలి

న్యూశాయంపేట: గురుకులాల్లో పనిచేస్తూ ఇటీవల ప్రమోషన్లు, బదిలీలు, నూతన నియామకాల కారణంగా ఉద్యోగాలు కోల్పోయిన ఉపాధ్యాయులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖుర్షీద్ పాషా డిమాండ్ చేశారు. వరంగల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వందలాది గురుకులాలు ఏర్పాటుకాగా, నిబద్ధతతో పనిచేస్తూ విద్యాభివృద్ధి కోసం వారు తమ వంతు కృషిచేశారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో గ్రేస్ మార్కులు ప్రకటించి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని, ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని ప్రకటించి వాడుకుని వదిలేసిందని ఆరోపించారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాల్లో పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇచ్చి ఆదుకోవాలని తెలిపారు. సమావేశంలో రాజయ్య, శేఖర్, మధు, పరశురాములు, రమణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

నూతన భవనంలోకి వసతి గృహాన్ని తరలించాలి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు వినతి

హన్మకొండ: హనుమకొండ జులైవాడలోని గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని హనుమకొండ అశోకకాలనీలో గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాల ఆవరణలో నిర్మించిన నూతన భవనంలోకి మార్చాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్, గిరిజన రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ భాస్కర్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ హనుమకొండ, వరంగల్ వసతి గృహాలు రెండు ఒకే క్యాంపస్‌లో ఉన్నాయని తెలిపారు. అందులో ఒకదాన్ని అశోకకాలనీలో నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చాలని సూచించారు. రెండు హాస్టళ్ల ఆవరణలు కలిసి ఉండడంతో ఏ విద్యార్థి ఏ హాస్టల్‌కు చెందిన వారో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఆ రెండు హాస్టళ్లలో దాదాపు 500 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారని వివరించారు. కార్యక్రమంలో అరుణ్ నాయక్, శ్రీనివాస్ నాయక్, భాస్కర్ నాయక్, రోహిత్, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి

హసన్‌పర్తి: వరుసగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ జవ్వాజి సురేష్ సూచించారు. ఈమేరకు హసన్‌పర్తి మండలం ముచ్చర్ల గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా చెరువులు, కాల్వల వద్దకు వెళ్లొద్దని అన్నారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ప్రసారమయ్యే ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలు, ఇళ్లను ఖాళీ చేయాలని హెచ్చరించారు. ఎస్సై దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లోని దక్షిణముఖ అభయాంజనేయస్వామి దేవాలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అనగం యాదగిరి, చిలువేరు మహేష్, నాగవెల్లి శ్రీధర్, మిట్టపల్లి రవిందర్, మహేందర్, గన్ను రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ

హన్మకొండ: హనుమకొండ గోపాల్‌పూర్‌లోని స్పేస్ హైస్కూల్‌లో శనివారం బోనాల పండుగను జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా వైభవంగా బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారి వేషధారణలో విద్యార్థినులు, పోతరాజు వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కిరణ్మయి, ప్రిన్సిపాల్ అఖిల మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యత తెలిపేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

మౌనదీక్షను విజయవంతం చేయాలి

కాశిబుగ్గ: పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మౌన దీక్షను విజయవంతం చేయాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా శాఖ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈమేరకు కార్యాలయంలో దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నరసింహరెడ్డి, వీరాస్వామి, రామ మనోహర్, రాజయ్య, సుధీర్‌బాబు, సదానందం, రవీందర్, సమ్మారెడ్డి, సారంగపాణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా రెడ్ డే ఉత్సవం

వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని లర్నర్స్ ల్యాండ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు శనివారం రెడ్ డే ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ తాళ్ల మల్లేషం మాట్లాడుతూ పిల్లలు ఒకరిపట్ల ఒకరు ప్రేమానురాగాలతో, స్నేహభావంతో ఉండాలని సూచించారు. పిల్లల పట్ల ప్రేమ, అభిమానం, సంతోషానికి సంకేతంగా 'రెడ్ డే' ఉత్సవాలు నిర్వహించినట్లు వివరించారు. ప్రిన్సిపాల్ జెస్సీ రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'తాళ్ల పద్మావతి'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో వంద మంది విద్యార్థులకు జెన్‌పాక్ట్ సంస్థ శనివారం ఉద్యోగ అవకాశాలను కల్పించింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్ కోసం 650 మంది విద్యార్థులు హాజరు కాగా, వివిధ పరీక్షలు నిర్వహించి వంద మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు వివరించారు. విద్యా సంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, కళాశాల డైరెక్టర్లు వంశీ, చైతన్య, జెన్‌పాక్ట్ టాస్క్ రీజినల్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వేలు, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్ రావు, అజిత్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

విద్యారణ్యపురి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.31శాతం నిధులే కేటాయించిందని, కనీసం 20శాతం కేటాయించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసనలో అఖిల భారత విద్యాహక్కు వేదిక కోశాధికారి డాక్టర్ గంగాధర్, భారత్ బచావో జిల్లా బాధ్యులు డాక్టర్ వెంకట్‌రెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి, డీటీఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రఘుపతి మాట్లాడారు.

45 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

హన్మకొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 45శాతం రిజర్వేషన్ల సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ ఉల్లెంగల యాదగిరి కోరారు. ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ క్లాస్ ఫెడరేషన్ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్యను ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

కాశిబుగ్గ: మానసిక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ భార్యకు భారం అవుతున్నాననే బాధతో రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వరంగల్ రైల్వే స్టేషన్ లూప్‌లైన్‌లో శనివారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నల్లబెల్లికి చెందిన వద్లూరి సత్యం (43) తలకు కొన్నేళ్ల క్రితం గాయం కాగా, మానసిక అనారోగ్య సమస్యలతో బాధపడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

కాజీపేట బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం

కాజీపేట: కాజీపేట రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం బ్రిడ్జిపై ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా, 108 అంబులెన్స్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

ఇంధన పొదుపు పాటించాలి



అవార్డులు అందుకున్న వారితో ధరంసింగ్

హన్మకొండ: డ్రైవర్లు ఇంధన పొదుపు పాటించాలని ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ సూచించారు. హనుమకొండ రాంనగర్‌లోని డిపోలో ప్రగతిచక్రం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వృత్తిలో నైపుణ్యం ప్రదర్శించిన, సంస్థకు అధిక ఆదాయం తీసుకొచ్చిన ఉద్యోగులకు అవార్డులు, ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఆయన మాట్లాడుతూ మెకానిక్‌లు బస్సులను కండీషన్‌లో ఉంచాలని, డ్రైవర్లు ఇంధనం ఆదా అయ్యేలా డ్రైవింగ్ చేయాలని తెలిపారు. బస్సులు బ్రేక్ డౌన్ కాకుండా బస్సుల నిర్వహణ ఉండాలని పేర్కొన్నారు. అనంతరం లక్ష్మే లక్ష్యంలో భాగంగా సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నజియా సుల్తానా, మెకానికల్ సూపర్‌వైజర్ వి.చంద్రశేఖర్, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వెంకట్, కార్మికులు

హన్మకొండ: కార్మికుల చట్టాల సవరణ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలో తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య కరపత్రాలను కార్మికులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 4న వరంగల్‌లో కార్మికవర్గ హక్కుల సాధన, కేంద్ర ప్రభుత్వం చేసిన కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్మిక చట్టాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాసిందని దుయ్యబట్టారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్మికులు దాసరి రమేష్, ఉమ, విజయ, జ్యోతి, మమత, సంధ్య, వినోద, నాగమణి, మమత, ఇందిర, శోభ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఖిలా వరంగల్: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్ యాదవ్ తెలిపారు. ఖిలా వరంగల్ పడమర కోటలోని ముదిరాజ్‌లో లయన్స్ క్లబ్ భీమారం, హనుమకొండ, వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో జారతి సత్యనాథ్ అధ్యక్షతన ఉత్తమ రైతులకు సన్మానోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ రైతులు సమాజానికి వెన్నెముక లాంటి వారిని కొనియాడారు. వారికి చేయూతనందించడానికి లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. జిల్లా పూర్వ గవర్నర్ లయన్ పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, ఆర్‌సీ రేవతి, రాజారాం, రవీందర్‌రావు, చంద భాస్కర్, మోత్కూరు మనోహర్ రావు, ప్రసాద్‌రావు, రామలింగేశ్వర రావు, సాగర్ల శ్రీనివాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ రైతులను సన్మానిస్తున్న ప్రతినిధులు

గ్రేటర్ వరంగల్ సిటీ ప్లానర్‌గా శైలజ

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిటీ ప్లానర్‌గా ఎం.శైలజ, సిటీ డిప్యూటీ ప్లానర్‌గా రవీంద్ర నియామకమయ్యారు. ఈమేరకు రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో బల్దియా అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తూ బదిలీపై జీహెచ్ఎంసీకి బదిలీపై వెళ్లి అక్కడే డిప్యూటీ సిటీ ప్లానర్‌గా పదోన్నతి పొందారు. సిటీ ప్లానర్‌గా నగరానికి చెందిన శైలజ నియామకమయ్యారు.